


జాతీయ లోక్ అదాలత్ జులై 5కి మార్పు

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర, ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి అందిన ఉత్తర్వుల ప్రకారం మే 10వ తేదీన జరగవలసిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై 5వ తేదీకి మార్చబడిందని పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి తెలిపారు. ఈ విషయాన్ని గమనించి న్యాయవాదులు, కక్షిదారులు, పోలీస్ అధికారులు తమ కేసులను జూలై 5వ తేదీన రాజీ చేసుకొనుటకు సంసిద్ధం అవ్వాలని తెలిపారు. ప్రతిరోజు ఉమ్మడి జిల్లాల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ సమక్షంలో భార్యభర్తల కుటుంబ తగాదాలను, గూగుల్ మీట్ ద్వారా నిర్వహిస్తున్న కౌన్సలింగ్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి తెలిపారు.



వాసంతి

కౌలు రైతులకు..

'పెట్టుబడిసాయం' ఇచ్చేనా..!

ఈనెలఖారుకు 'అన్నదాత సుఖీభవ' సొమ్ములు జమచేస్తామని ప్రభుత్వం ప్రకటన

కౌలు రైతులకు సాయంపై విధి విధానాలు విడుదల చేయని పరిస్థితి

భూ యజమానులకు సంబంధించి మాత్రమే జాబితాకు ఆదేశాలు

ఒకే సర్వే నంబర్‌పై భూ యజమానికిస్తే..

కౌలురైతు పరిస్థితి ఏమిటి.?

కౌలురైతులకు భూయజమాని అంగీకారం పత్రం నిబంధనపై వీడని సందిగ్ధత

వాస్తవ సాగుదారులను విస్మరిస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత తప్పదు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అందించే పెట్టుబడి సాయం ఈ నెలఖారుకు అందిస్తామని ప్రకటించింది. కేంద్రం ఇచ్చే రూ.ఆరు వేలు కాకుండా మిగిలిన రూ.14 వేలు కేంద్రం సాయంతోపాటు ఇస్తామని తెలిపింది. దీంతో కౌలురైతులకు పెట్టుబడి సాయం అందేనా అన్న చర్చ రైతుల్లో కొనసాగుతోంది. భూ యజమానుల అర్హత జాబితాను వెబ్‌ల్యాండ్ ఆధారంగా రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితాను ఈ నెల 20వ తేదీకి పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. కౌలురైతుల అర్హుల జాబితా రూపకల్పనపై మాత్రం అధికారులకు ఎటువంటి ఆదేశాలూ విడుదల కాలేదు. భూ యజమానులతో పాటు ఈనెలఖారుకు కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములు ఇస్తారా.. లేదా అనేది తెలియని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. 2014-19 టిడిపి పాలనలో కౌలు రైతులకు సంబంధించి అధికారులు తేల్చిన లెక్క ఇది. రెండు జిల్లాల వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే సాగుచేస్తున్నారు. నిబంధనల ప్రకారం పెట్టుబడిసాయం అనేది సాగుచేసే రైతులకు అందించాలి. ప్రభుత్వాలు మాత్రం పెట్టుబడి పెట్టి సాగుచేసే కౌలురైతులకు కాకుండా భూ యజమానులకు అందిస్తోంది. దీంతో ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతింటే ప్రభుత్వం అందించే పంటసాయం, బీమా వంటివి సైతం భూయజమానుల జేబుల్లోకే వెళ్లిపోతున్నాయి. దీంతో ఏటా జిల్లాలో కౌలురైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆత్మహత్యలు చేసుకున్న కౌలురైతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం సైతం అందించారు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతులను పూర్తిగా ఆదుకుంటామంటూ గడిచిన ఎన్నికల్లో కూటమి నేతలు ఊదరగొట్టారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి కౌలురైతుల అర్హుల ఎంపికకు ఎటువంటి విధివిధానాలు ఖరారు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ పథకం కింద అందించే పెట్టుబడి సాయం ఏలూరు జిల్లాలో లక్షా 32 వేల మంది అందుకుంటున్నారు. పశ్చిమలోనూ అదే సంఖ్యలో రైతులు ఉన్నారు. పిఎం కిసాన్ సాయం కేంద్రం భూ యజమానులకు మాత్రమే అందిస్తోంది. కౌలు రైతులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్నదాత సుఖీభవ కింద ఇచ్చే రూ.20 వేలు కౌలు రైతులకు సైతం అందిస్తామని చెప్పింది. కార్యాచరణ మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతోంది.



కౌలుకార్డులు అందరికీ ఇస్తారా?

గత వైసిపి ప్రభుత్వం కౌలు కార్డులు జారీలో ఆంక్షలు విధించింది. సాగుచేస్తున్న కౌలు రైతులందరికీ ఇవ్వకుండా జిల్లాకు ఇన్ని కార్డులు జారీ చేయాలని టార్గెట్ పెట్టింది. కూటమి ప్రభుత్వం సైతం అదేదారిలో నడుస్తోంది. ఈ ఏడాది ఏలూరు జిల్లాలో 75 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలని టార్గెట్ పెట్టారు. పశ్చిమలోనూ లక్షా మందికిపైగా కౌలురైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని టార్గెట్ తీసుకున్నట్లు చెబుతున్నారు. వ్యవసాయ సాగుచేసిన కౌలు రైతులందరికీ కౌలు కార్డులు జారీచేయకుండా టార్గెట్‌లు పెట్టడం ఏంటో అర్థం కావడం లేదు. దీంతో చాలా మంది రైతులకు కౌలుకార్డులు అందని పరిస్థితి ఏర్పడనుంది. కౌలుకార్డులు ఆధారంగా అన్నదాత సుఖీభవ అందిస్తారని అధికారులు చెబుతున్నారు. సాగుచేసే కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వకపోతే కౌలు రైతులకు న్యాయం ఏవిధంగా జరుగుతుందో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. అంతేకాకుండా కౌలుకార్డు జారీకి భూయజమాని అంగీకార పత్రం ఉండాలంటూ గత వైసిపి ప్రభుత్వం నిబంధనలు విధించింది. చట్టంలో మార్పులు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ఏడాది గడిచినా ఇప్పటికీ చట్టం చేయలేదు. కౌలుకార్డు జారీకి భూయజమాని అంగీకార పత్రం ఉండాలా.. లేదా అన్నదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అదేవిధంగా ఒక సర్వే నంబర్‌పై భూయజమానికి, కౌలురైతుకు పెట్టుబడిసాయం అందిస్తారా లేదా అనేది సైతం ప్రభుత్వం చెపాల్సి ఉంది. ఇవన్నీ తేలాలంటే కౌలురైతులకు అన్నదాత సుఖీభవ అందించే విధివిధానాలు విడుదల చేయాలి.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు నేతలు



తణుకు: లేబర్ కోడ్స్‌పై వచ్చిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నేతలు



తాడేపల్లిగూడెం : నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) సర్వసభ్య సమావేశం శుక్రవారం చుక్కా అప్పలస్వామి భవనంలో చిటికిన రాము అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి ఆ పేరుతో కార్మికులను కట్టు బానిసల్లా మార్చడం కోసం, యజమానులకు కార్మిక వర్గం శ్రమశక్తిని దోచి పెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని సిఐటియు ఖండిస్తోందన్నారు. లేబర్ కోడ్ల పేరుతో కార్మిక చట్టాల్లో తీసుకొచ్చిన మార్పులు కార్మికవర్గ ప్రయోజనాలను కాలరాసి, పెట్టుబడిదారులకు దాసోహం అన్న పద్ధతిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీలకు దేశ సంపద మొత్తం దోచిపెట్టే విధంగా మోడీ ప్రభుత్వం ఉందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలను కలుపుకొని నిరవధిక సమ్మె చేయడానికైనా కార్మిక వర్గం సిద్ధమని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ చట్టాలపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలని, లేదంటే మోడీ ప్రభుత్వం విభజన చట్టాల అమలు చేయకుండా విశాఖ ఉక్కు మీద మాట్లాడకుండా రాష్ట్ర ప్రజలను మోసగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా మనుధర్మ రాజ్యాంగానికి అనుకూలంగా పని చేస్తోందన్నారు. ఈ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని లేనిపక్షంలో దేశంలోని కార్మిక, ఉద్యోగ సంఘాలను కలుపుకొని దశల వారీ ఆందోళనలు చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిటికిన రాము, అయినాల సత్యనారాయణ, దాసరి రాజు, సుందరపు అప్పలనాయుడు, రౌతు పాపినాయుడు, ఇ.గోవిందరావు, పి.గోవిందు, బి.నాగేశ్వరరావు, చిట్టేటి సత్యనారాయణ, బి.తాతారావు, అడపా లోవ, ఎడ్ల శ్రీను పాల్గొన్నారు.

తణుకు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 20న జరిగే సమ్మెకు కార్మిక సంఘాలు, కార్మికులు ఒక్కటై ఉద్యమించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి నాయకలు బొద్దాని నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో 20న జరిగే సమ్మెపై సిఐటియు మండల కార్యదర్శి గుబ్బల గోపి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లేబర్ కోడ్స్‌పై వచ్చిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్, నాగరాజు మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్‌కోడ్స్ ఎవరి కోసమో కేంద్ర ప్రభుత్వం చెప్పాలన్నారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు మరింత బలహీనులుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులను అణచాలని చూస్తే తగిన గుణపాఠం పాలకులు నేర్చుకోక తప్పదని హెచ్చరించారు. సిఐటియు జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, ఎఐటియుసి మున్సిపల్ యూనియన్ నాయకులు మందుల ముత్తయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు లేబర్ కోడ్స్ ద్వారా లేకుండా చేస్తామంటే ఉద్యమాలతో బుద్ధి చెబుతామన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు పిఎల్ నర్సింహారావు మాట్లాడుతూ ఈ నెల 14న నరేంద్ర సెంటర్‌కు ఉదయం 10 గంటలకు సమ్మె యాత్ర వస్తుందని, 17వ తేదీ మధ్యాహ్నం 5 గంటలకు బైక్ ర్యాలీ చేయాలని, 20న చిట్టూరి ఇంద్రయ్య కాలేజ్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకూ కార్మిక సంఘాల ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రాజు, గార రంగారావు, కొంబత్తుల రవి, ఎ.వెంకటేశ్వరరావు, ఆరుగోలు రమేష్, పి.దక్షిణామూర్తి పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల రక్షణకు చర్యలు చేపట్టాలి

హైకోర్టు ఉత్తర్వుల మేరకు హైపవర్ కమిటీ ఏర్పాటు

మూడు నెలలకోసారి ఆక్రమణల గుర్తింపు, తొలగింపుపై సమీక్ష

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పంచాయతీ ఆస్తుల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన పంచాయతీ ఆస్తుల రక్షణకు ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి హై పవర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మూడు వర్గాలుగా పంచాయతీ ఆస్తులను వర్గీకరించడం జరిగిందని, ఆస్తుల రక్షణకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై ఆక్రమణల గుర్తింపు, తొలగింపు పురోగతిని సమీక్షించడానికి హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి హై పవర్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూ జాబితా వివరాలను పొందిన తర్వాత పంచాయతీ కార్యదర్శి గ్రామసభను సమావేశపరిచి సమాచారాన్ని ధృవీకరించాలన్నారు. తరువాత గ్రామ పంచాయతీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, భూ జాబితా వివరాలను చర్చించి, తీర్మానం చేయడం ద్వారా ఆమోదించాలని తెలిపారు. ఆక్రమణల తొలగింపు సందర్భంలో పోలీస్ సహకారం తీసుకోవాలని తెలిపారు. తొలగింపు ప్రక్రియను పర్యవేక్షించడం ద్వారా తన అధికార పరిధిలోని గ్రామ పంచాయతీ ఆస్తులను రక్షించడానికి డివిజనల్ పంచాయతీ అధికారి ఈ కేసులపై నెలవారీ సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, ఆర్ అండ్ బి ఎస్‌ఇ ఎ.శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్‌ఇ పి.నాగార్జున రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కెఎస్ఎస్.శ్రీనివాసరావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి బి.రవికాంత్, జిల్లా సర్వేఅధికారి కె.జాషువా పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించి ఇళ్లను తొలగించండి

అఖిలపక్ష సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉండి

పంట కాలువలు, మురుగు కాలువల వద్ద ప్రభుత్వ స్థలాల్లో ఉన్న నిరుపేదల ఇళ్లను తొలగించే ముందు వారికి ప్రత్యామ్నాయం చూపించాలని సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ అఖిలపక్ష సమావేశంలో కోరారు. శుక్రవారం సాయంత్రం ఉండి ఇరిగేషన్ కార్యాలయంలో స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సూచనల మేరకు డీసీ చైర్మన్ తోట ఫణి ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, కానీ నిరుపేద ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వారి నివాసాలను తొలగించకుండా, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతే తొలగించాలని ఆయన సూచించారు. కాల్వగట్ల వెంబడి ఉన్న ఇళ్లకు ప్రత్యామ్నాయంగా పంచాయతీ వారు సహకరించాలని, వారికి అవసరమైతే సీసీ డ్రెయినేజీ సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు గళావిల్లి ధనుంజయ మాట్లాడుతూ తొలుత ఆక్వా రైతులు నేరుగా పంట కాలువలలోకి విడుదల చేసే ఆక్వా వ్యర్థ జలాలను నిలుపుదల చేయించాలని నాలుగు నెలల కిందట స్థానిక ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు ఆక్వా వ్యర్థ జలాలు నేరుగా పంటకాలవలోకి విడవరాదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. గృహవినియోగం నుంచి వచ్చే మురుగు మాత్రమే పంట కాలువల కలుషితానికి కారణం కాదని, ఆక్వా వ్యర్థాలు ప్రధాన కారణం అన్నారు. అనంతరం డీసీ చైర్మన్ తోట ఫణి మాట్లాడుతూ స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం మహదేవపట్నం నుంచి పంట కాలువలలోకి మురుగునీరు విడుదల చేసేవారి పైపులైనులను మూసి వేసే చర్యలు చేపడతామని అన్నారు. ప్రతి ఒక్కరూ వెంటనే వారి ఇళ్ల ముందు ఇంకుడు గుంటలు తవ్వుకోవాలన్నారు. దీనికి ఉండి డీసీ పరిధిలోని ప్రజలందరూ సహకరించాలని, మూసి వేసిన తర్వాత తిరిగి తెరిచినట్లయితే వారిపై కఠినచర్యలు తప్పవని ఆయన తెలిపారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన శుద్ధ జలాలను అందించేందుకు ఇప్పటికే రఘురామకృష్ణరాజు చర్యలు చేపట్టారని, ఆయన ఆశయ సాధనకు మనందరం సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరినారాయణరాజు, డీసీ ఉపాధ్యక్షులు మంతెన సాయిలచ్చిరాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, వైసిపి మండల అధ్యక్షులు పివిఆర్‌కె ఆంజనేయరాజు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మన నాగబాబు, జనసేన మండల అధ్యక్షులు యడవిల్లి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, కాంగ్రెస్ నాయకులు అడబాల శ్రీనివాసరావు, ఎంసిపిఐ నాయకులు గురువిల్లి రాంబాబు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ, పిహెచ్‌పి జిల్లా అధ్యక్షులు నల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

విపత్తులను సమగ్రంగా ఎదుర్కోవాలి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి విపత్తుల నిర్వహణపై అవగాహన శిక్షణ తరగతులను గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి అంశాన్నీ కూలంకుషంగా అర్థం చేసుకొని క్షేత్రస్థాయిలో అమలు చేసేలా అవగాహన పొందాలన్నారు. జిల్లాలో వరదలు, తుపాన్లు, ఉరుములు, మెరుపుల కారణంగా ఏ ఒక్క ప్రాణినీ కోల్పోకూడదని, విపత్తుల సమాచారం మారుమూల ప్రాంతాలకు సైతం చేరేంతగా వ్యవస్థను సిద్ధం చేసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులకు సంబంధించిన సందేశాలు రాష్ట్ర విపత్తుల శాఖ నుంచి ఎప్పటికప్పుడు అందుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి సమాచారాన్ని వ్యవసాయ భూముల్లో పనిచేస్తున్న కూలీలు, రైతులు, గొర్రెలు, పశువుల కాపరులు, అలాగే ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వెంటనే చేరే విధంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. బహిరంగ పొలాలు, బీచ్, నీటి మీద పడవలో ప్రయాణిస్తున్నప్పుడు, విడిగా, దూరంగా ఉన్న షెడ్లు లేదా బహిరంగ ప్రదేశాలలోని ఇతర చిన్న నిర్మాణాలు, ఏదైనా మెటల్-ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, మోటార్ సైకిళ్లు, సైకిళ్లపై పడే అవకాశం ఎక్కువ ఉందన్నారు. పిడుగు లేదా మెరుపు పడుతున్న సందర్భంలో యంత్రాలు వాడడం, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లటం, గాలిపటం వంటివి ఎగరవేయడం, నీటిలో ఈదడం, పొడవైన స్తంభాలు, చెట్లు వాటి కింద నిలబడడం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, డిపిఒ బి.అరుణశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వైద్య శాఖ సిబ్బంది, డ్వామా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

12న ఉపాధ్యాయ సమస్యలపై ధర్నా

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం



డిఇఒ కార్యాలయాధికారికి నోటీసులు అందజేస్తున్న యుపిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఈ నెల 12వ తేదీన ధర్నా చేపట్టనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్లోని డిఇఒ కార్యాలయాధికారికి యుటిఎఫ్ నేతలు ధర్నా నోటీసును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేసిక్ ఫౌండేషన్ స్కూల్లో మినిమం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని తెలిపారు. ఇది అమలు కాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. అలాగే పాఠశాలలు ఉపాధ్యాయ సమస్యలు దీర్ఘకాలికంగా వేధిస్తున్నాయని, వీటిని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. 12వ తేదీ ఉదయం 9 గంటలకు చేపట్టబోయే ఈ ధర్నాకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గౌరవాధ్యక్షుడు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, కె.బ్రహ్మయ్య, కెఎస్.రామకృష్ణప్రసాద్, మొగల్తూరు మండల అధ్యక్షుడు చింతపల్లి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

చలివేంద్రం జోలికొస్తే సహించేది లేదు : సిపిఎం



నవుదూరులో చలివేంద్రం వద్ద నినాదాలు చేస్తున్న సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం

నవుదూరులో దాతల సహకారంతో నిర్వహిస్తున్న కలిదిండి సూర్యనారాయణరాజు స్మారక చలివేంద్రం జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని సిపిఎం నాయకులు జుత్తిగ నర్సింహమూర్తి, లింగం సత్యనారాయణ శుక్రవారం హెచ్చరించారు. ఈ మేరకు చలివేంద్రం వద్ద నేతలు నినాదాలు చేశారు. గత నెల 28వ తేదీ రాత్రి ఇక్కడ చలివేంద్రం నిర్వహించడం ఇష్టలేని వ్యక్తులు కొంత మందికి మద్యం పోయించి వారిచే చలివేంద్రాన్ని ధ్వంసం చేయించారు. అయితే ధ్వంసమైన శిబిరంలోనే చలివేంద్రం కొనసాగుతోంది. చలివేంద్రాన్ని శుక్రవారం తిరిగి పునరుద్ధరించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు నర్సింహమూర్తి, సత్యనారాయణ మాట్లాడుతూ దాతల సహకారంతో కొనసాగుతున్న మజ్జిగ చలివేంద్రం అందరి మన్ననలు పొందడంతో కొంతమంది స్థానికులు జీర్ణించు కోలేకపోతున్నారన్నారు. ఎవరికీ అభ్యంతరంలేని చోట ఇబ్బంది లేకుండా సేవా భావతంతో కొనసాగుతున్న చలివేంద్రాన్ని మానవత్వంలేని కొంత మంది ధ్వంసం చేయించారన్నారు. ఇది సరికాదని తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చలివేంద్రం నిర్వహణకు సహకరిస్తున్నారన్నారు. మరోసారి చలివేంద్రం ధ్వంసం చేసేందుకు పన్నాగాలు పన్నితే మా ఆలోచనలు మార్చుకోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాళ్లబండి నారాయణమూర్తి, కవురు సుబ్బారావు, పాలా కోటేశ్వరావు, కిలాడి సత్యనారాయణ, అయినపూడి బాబురావు, మైగాపుల త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆచంటలో మోస్తారు వర్షం..

ధాన్యం ఒబ్బిడిలో రైతులు



ఆరబెట్టిన ధాన్యాన్ని యంత్రాల ద్వారా ఒబ్బిడి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పరిసర గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలితో కూడిన ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు ఉరకలు, పరుగులు పెట్టారు. మండలంలో ఇప్పటికే 70 శాతంపైగా కోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడంలో రైతులు తలమునకలై ఉన్నారు. ఈ తరుణంలో వర్షం పడడంతో కష్టపడి పండించిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంతాలు పడుతున్నారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు రహదారులపై ఆరబెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతం కావడంతో రైతులు యంత్రాల ద్వారానే పోగుచేసుకుని, బరకాలు కప్పి కాపాడుకోవడానికి ప్రయత్నించారు. కొద్దిపాటి సమయంలో వర్షం కురిసి ఆగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈదురుగాలితో కొన్ని ప్రాంతాలలో వరిచేలు నేలనంటాయి. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈదురుగాలులకు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. మరోవారం రోజుల పాటు వాతావరణం కరుణిస్తే గట్టెక్కుతామని రైతులు చెబుతున్నారు.

నేడు కలిదిండి, పేరంటాలు వర్ధంతి సభ

ప్రజాశక్తి - పెనుమంట్ర, వీరవాసరం





సూర్యనారాయణ రాజు, పేరంటాలు

అమరజీవి కలిదిండి సూర్యనారాయణ రాజు 75వ వర్ధంతి, పేరంటాలు 35వ వర్ధంతి ఈనెల 10వ తేదీ శనివారం నాడు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పెనుమంట్ర మండలం పొలమూరులోని కలిదిండి విజ్ఞాన గ్రంథాలయం నుంచి వీరవాసరం మండలం బూదారాయుడు చెరువు సమీపంలోని అమరజీవుల స్థూపం వరకు మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థూపం వద్ద నిర్వహిచే సభలో సిపిఎం జిల్లా, స్థానిక నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు, అభిమానులు అంతా పాల్గొనాలని కోరారు.

మార్టేరు -పెనుగొండ రోడ్డులో రాకపోకలు నిలిపివేత

ఆర్‌అండ్‌బి శాఖ హెచ్చరిక బోర్డులు లేక ప్రయాణికుల ఇబ్బంది

ప్రజాశక్తి - పెనుమంట్ర




నెగ్గిపూడి వద్ద కల్వర్ట్ నిర్మాణ పనులు

నరసాపురం-ప్రక్కి లంక రహదారిలో నరసాపురం-నిడదవోలు కాల్వపైన మండలంలోని నెగ్గిపూడి(మార్టేరు) వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ పనుల నిమిత్తం మార్టేరు-పెనుగొండ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. ఇందుకోసం ఇటు మార్టేరు సెంటర్లో, అటు పెనుగొండ కాలేజీ రోడ్డు వద్ద పెద్ద రాళ్లతో గుట్టలు వేశారు. మార్గం మూసివేసినట్లు ఆర్‌అండ్‌బి శాఖవారు ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం కానీ, దారి మళ్లింపు గురించి చెప్పేవారిని అక్కడ ఉంచకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్టేరు, పెనుగొండల వద్ద రాళ్ల గుట్టలు పక్కకు జరిపి మరీ పలువురు చిన్న కార్లు, ద్విచక్ర వాహనదారులు నెగ్గిపూడి కల్వర్టు నిర్మాణం వద్దకు నేరుగా వెళ్లి దారి ఇవ్వమని అక్కడ పనుల్లో ఉన్న కార్మికులతో గొడవపడుతున్నారు. ఒక పక్క జెసిబితో తవ్వకం పనుల కోసం దారి మూసివేసిన కొందరు దారి వదలమని కార్మికులతో వాదనకు దిగడం శోచనీయమని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కల్వర్ట్ నిర్మాణ పనులు వేగవంతంగా జరగడం కోసం ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా ఆ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పిహెచ్‌సి వైద్యునిగా ఓంకార్‌నాద్

ప్రజాశక్తి - గణపవరం



గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర రెండవ డాక్టర్‌గా కమతం ఓంకార్ నాద్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా వచ్చిన డాక్టర్ ఓంకార్ నాద్‌కి ఆసుపత్రి డాక్టర్ పి.కిరణ్మయి, సిహెచ్‌ఓ జాలాది విల్సన్ బాబు, వైద్య సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఓంకార్ నాద్ మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి సూచనల ప్రకారం ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవలందిస్తానని చెప్పారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో తనకి కేటాయించిన గ్రామాల్లో వైద్య సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి.పద్మజ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఐ.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు యేహాన్, జి.శ్రీనివాస్, ధనంజయ, ఎం.నల్లయ్య పాల్గొన్నారు.

బాలింతలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథం కలిగి ఉండాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కేటి పుష్పరాజ్ అన్నారు. శుక్రవారం ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పురుడు పోసుకున్న బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుష్ప రాజ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజంలో సేవాదాగి సహాయపడేలా సేవా దృక్పథం కలిగి ఉండాలని, పుట్టినరోజులు పేరు చెప్పి అనవసర ఖర్చులు కన్నా పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలకు చదువులతో పాటు సమాజంలో జరిగే కార్యక్రమాలపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా టెక్నాలజీ డెవలప్మెంట్ అవుతున్న రోజుల్లో కూడా కనీసం ఎదుటివారిని గౌరవించే స్థాయి తగ్గిపోతుందని, అలాగే మనం చదువుకున్న ఉపాధ్యాయులను గౌరవించేలా పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది పుట్టినరోజు జరుపుకుంటున్న సోది శ్యాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో నక్కేటి లక్ష్మీబాయి, అమల, కోలాటి జయశ్రీ, సత్యనారాయణ, ప్రసాదరావు, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించాలి

సిపిఎం పట్టణ నాయకులు వైకుంఠరావు

ప్రజాశక్తి - భీమవరం

టిడ్కో ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 82 ఎకరాల్లో నిర్మాణం చేసిన టిడ్కో ఇళ్లు ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేస్తున్నా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానం అమలు చేయట్లేదన్నారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించి, కలెక్టరేట్ వద్ద వేలాది మందితో ధర్నా చేసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి


పిహెచ్‌సి వైద్యురాలు బిన్నీశామ్యూల్

ఉండి : వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ బిన్నీ శామ్యూల్ అన్నారు. శుక్రవారం ఉండి మండలం వెలివర్రు గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డాక్టర్ బిన్నీ శామ్యూల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బిన్నీ శామ్యూల్ మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం వేళల్లోను, సాయంత్రం వేళల్లోనూ ఎండ తీవ్రత లేని సమయంలో బయటకి వచ్చి పనులు చేసుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరూ డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్‌ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్లు, సబ్జా, బార్లీ నీళ్లు వంటివి తీసుకోవాలని, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని వారు సూచించారు. అనంతరం వృద్ధులకు, గర్భిణులకు, చిన్నారులకు వైద్యసేవలు అందించి, వారికి కావాల్సిన మందులను అందజేశారు.

ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం

నరసాపురం : ప్రపంచ రెడ్‌క్రాస్ డే దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలను అనుసరించి కార్మిక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రెడ్ క్రాస్ సంస్థలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరానికి నరసాపురం, పాలకొల్లు పట్టణంలోని వివిధ సంస్థలు, దుకాణాలలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు, భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కంభంపాటి వివేక్, రెడ్‌క్రాస్ సమన్వయకర్త ఎనుమలు సతీష్ పాల్గొన్నారు.

ఎంపిడిఒగా ప్రభాకర్‌రావు నియామకం



పెనుమంట్ర : పెనుమంట్ర మండల పరిషత్ నూతన అభివృద్ధి అధికారిగా ఎస్.ప్రభాకర్ రావు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కాళ్ల మండల పరిషత్ పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై ఎంపిడిఒగా ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపిడిఒ శామ్యూల్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన ఎంపిడిఒ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

వక్ఫ్ బోర్డు భూముల పరిశీలన

మొగల్తూరు: మొగల్తూరులో వక్ఫ్ బోర్డుకు చెందిన సుమారు 4 ఎకరాల్లో ఇసుక అక్రమ తరలింపుపై అధికారులు విచారణ చేపట్టారు. ఆ భూముల్లో ఆక్వా సాగు చేసేందుకు గ్రామానికి చెందిన వ్యక్తి నాలుగేళ్ల కాలపరిమితికి లీజుకు తీసుకున్నారు. చెరువు తవ్వడంలో భాగంగా ఆ భూముల్లోని ఇసుకను అక్రమంగా తరలించారు. దీనిపై ఆగ్రహించిన మైనార్టీ పెద్దలు ప్రభుత్వ సహకారంతో ఎసి నిమిత్తం ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మైనార్టీ సంక్షేమశాఖ సూపరింటెండెంట్ మూర్తి సిబ్బందితో కలిసి మొగల్తూరు వచ్చారు. చెరువు, ఇసుక తరలించిన ప్రాంతాలను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

మొగల్తూరు : పోక్సోకేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ముత్యాలపల్లి గ్రామానికి చెందిన చిక్కాల రాజు(21) ప్రేమపేరుతో బాలిక(17)ను వంచించాడు. దీనిపై ఆ బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారని ఎస్ఐ తెలిపారు.

ప్రతి విద్యార్థినీ ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఆదిత్య స్కూల్ డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ లయన్ కృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తమ స్కూల్లో చదివే ప్రతి స్టూడెంట్‌ని బెస్ట్ స్టూడెంట్‌గా తీర్చిదిద్దేందుకే నిరంతరం శ్రమిస్తామని ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ లయన్ కృష్ణంరాజు అన్నారు. ప్రజాశక్తితో ఆయన స్కూల్లో విద్యార్థులు సాధించిన పలు విషయాలను పంచుకున్నారు. గత 31 సంవత్సరాలుగా క్రమశిక్షణతో కూడిన విద్యార్థులకు ఒత్తిడి లేకుండా విద్యను అందిస్తున్నామన్నారు. అలాగే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ప్రతిఏటా పదో తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలోనే కార్పొరేట్ సంస్థలకు దీటుగా తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ఆయన తెలిపారు. చదువుతోపాటు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో జరిగిన అన్ని రకాల పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు అద్భుత విజయాలు సాధిస్తున్నారన్నారు. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన పరీక్ష పేచర్చ కార్యక్రమంలో మన రాష్ట్రం నుండి 8 మంది విద్యార్థులు పాల్గొనగా మా స్కూలు నుంచి బిఎన్ఎస్ శశికాంత్ 9వ తరగతి విద్యార్థి పాల్గొన్నారని తెలిపారు. చదువుతోపాటు క్రీడలు, డాన్స్, కరాటే, యోగ, ధ్యానం వంటి శిక్షణ ఇస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థులు అంటే చదువుతోపాటు సామాజిక బాధ్యత ఎంతో అవసరమని దీంతో విద్యార్థి దశ నుండి



ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్

సేవాభావం అలవర్చే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యం పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం కోసం నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆటవిడుపు కోసం విజ్ఞాన, విహారయాత్రలు చేపడుతున్నామని, దీంతో వారు ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారన్నారు. అంతేకాకుండా ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించడానికి బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు.

10 ఫలితాలలో విజయభేరి..

ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 587 ఎంఎస్ఎన్.శివాని స్కూల్ ఫస్ట్ కాగా విద్యార్థులు 540పైగా 80 మంది మార్కులు సాధించారన్నారు. అలాగే 500 మార్కులకుపైగా 124 మంది సాధించి విజయభేరి మోగించారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థి తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదలతోనే అద్భుతమైన ఫలితాలు సాధిస్తామన్నారు. అతి తక్కువ ఫీజులతో స్కూల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తామన్నారు.

నాట్‌లో నేషనల్ ర్యాంక్..

జాతీయ స్థాయి నాట్ టాలెంట్ టెస్ట్‌లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ తమ విద్యార్థిని ఎస్‌వి.వైష్ణవి నాగసాయి సాధించిందని, ఆమెకు స్కూల్ తరపున రూ.25 వేల నగదు బహుమతి అందించి అభినందించడం జరిగిందని తెలిపారు.



కరాటే విద్యార్థులతో లయన్ కృష్ణంరాజు

విపత్తులపై అవగాహన

ఆడియో సదస్సులో జిల్లా అధికారి దోశరాజు

ప్రజాశక్తి - గణపవరం

జాతీయ విపత్తులపై మండలంలోని అధికారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడియో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల జిల్లా అధికారి వై.దోశరాజు ప్రకృతి విపత్తులు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. పిడుగులు, వరదల సమయాల్లో ప్రజలకు ఏవిధంగా రక్షణ కల్పించాలో తెలియజేశారు. ప్రకృతిపరంగా ప్రజలకు సంభవించే ప్రమాదాలను నివారించడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు నష్టం కలగకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజారక్షణలో భాగం పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.బేబీశ్రీలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సిల్ట్ తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కాలువలను పరిశుభ్రంగా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన సిల్ట్ తొలగింపు పనులను చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం యనమదుర్రు రోడ్డులోని లాకువ వద్ద శుక్రవారం సిల్ట్ తొలగింపు పనులను ఆయన ప్రారంభించారు. యనమదుర్రు లాకువ నుంచి దిసురుమర్రు వరకు సిల్ట్ తొలగింపు పనులు జరుగుతాయని, దీని ద్వారా క్రింది ప్రాంతాలకు కూడా నీరు పూర్తిగా వెళుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడుతుందని, గత ప్రభుత్వ పాలనలో రైతులకు అన్యాయం జరిగిందని, కనీసం కాలువలు, డ్రెయిన్లను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కునాదిరాజు మురళీకృష్ణంరాజు, డిసి ప్రెసిడెంట్ రుద్రరాజు పుల్లంరాజు, జనసేన నాయకులు బండి రమేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - ఉండి

కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని అంగన్వాడీ కార్యకర్త శ్యామల అన్నారు. శుక్రవారం ఉండి మండలం వెలివర్రు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. 18 ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీస్ స్టేషన్లో గానీ, ఐసిడిఎస్ అధికారులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా, సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు అనురాధ, కిషోర బాలికలు, వారి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని గణపవరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.తులసి అన్నారు. శుక్రవారం జల్లికొమ్మరలో జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 11-18 సంవత్సరాల వయసు ఉన్న కౌమార బాలికలకు బాల్యవివాహాలు చేయటం వల్ల జరిగే ఇబ్బందులను తులసి వివరించారు. కౌమార దశలో ఉన్న ఆడపిల్లలకు శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉండదని, అందువల్ల వివాహాలు చేయటం నేరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె.శ్రీలక్ష్మీ, ఎఎన్ఎంలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : బాలికలు ఉన్నత చదువుల ద్వారా అన్ని రంగాల్లో ఎదగాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాతా రాణి హితవు పలికారు. శుక్రవారం మండలంలోని మార్టేరు గ్రామ తోకపేట అంగన్వాడీ సెంటర్‌లో జరిగిన కిశోరి వికాసం వేసవికాల శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కిశోరి బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని ఆర్థిక స్వావలంబన, స్వాతంత్రం సాధించాలని ఆకాంక్షించారు. బాల్యవివాహాలు చేసుకోరాదని, ఎవరికైనా బాల్యవివాహాలు జరిపిస్తున్నట్లయితే సమాచారం నేరుగా విలేజ్ లెవెల్ కమిటీ సభ్యులకు గాని, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి తెలియపరచాలన్నారు. బాలికలందరూ పోషకాహారం తీసుకుంటూ, ఆరోగ్యంగా ఉండాలని, ఆత్మవిశ్వాసంతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ అంగర కృష్ణకుమారి, నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, సూపర్ వైజర్ టి.పోశమ్మ, ఎఎన్ఎంలు బి.సుజాత, విఒ డి.దుర్గాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

20న విధులకు హాజరుకాబోమని వినతి

మొగల్తూరు : ఈనెల 20న సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో అంగన్వాడీలు పాల్గొంటున్నారని, విధులకు హాజరు కారని తెలుపుతూ సిడిపిఒ బి.ఊర్మిలకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారని ప్రభుత్వాన్ని కోరుతూ చేపట్టనున్న సమ్మెలో అంగన్వాడీలు విధులకు హాజరుకారని తెలుపుతూ వినతిపత్రాన్ని అందించారు. జి.పెద్దింట్లు, ఎ.సీత, పి.మంగామణి, కె.జ్యోతి ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ టెక్నాలజీ దినోత్సవం

పాలకొల్లు : స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ అటానమస్ కళాశాల లో శుక్రవారం జాతీయ టెక్నాలజీ దినోత్సవాన్ని కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం, ఐక్యు ఏసి-ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి.యామిని ప్రారంభోపన్యాసంలో ఇటువంటి ముఖ్యమైన కార్యక్రమాలు విద్యార్థులకు అన్ని విషయాలలో అవగాహన కల్పిస్తాయని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఇన్‌ఛార్జి, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం మాట్లాడుతూ జాతీయ టెక్నాలజీ దినోత్సవం ప్రాముఖ్యతను, 1998లో ప్రోక్రాన్ న్యూక్లియర్ వెపన్స్ విజయవంతమైన సందర్భంగా మే 11 టెక్నాలజీ దినోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో చివరిగా గత నెల రోజుల నుంచి కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకుంటున్న ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఐఐసి కన్వీనర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, మెంబెర్ డాక్టర్ వి.విజయలక్ష్మి, కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకులు సిహెచ్.రవికుమార్, బి.ఆశాజ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ శిబిరం

పాలకొల్లు : వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆర్థిక సహాయంతో నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ క్లాసులు శుక్రవారంతో ముగిసాయి. ఏప్రిల్ 24 నుంచి మే 9 వరకు జరిగిన ఈ క్లాసులకు పాలకొల్లు పట్టణంలోని అనేక పాఠశాలల నుండి 6 నుండి 10వ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులు హాజరయ్యి చక్కటి ఇంగ్లీష్ నేర్చుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరి చేత ఇంగ్లీషులో మాట్లాడే లాగా తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణ శ్రీసరస్వతీ శిశుమందిర్ హైస్కూల్‌లో జరిగింది. ఈ ముగింపు కార్యక్రమానికి పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు అధ్యక్షత వహించి వెంకటరామరాజు దేశవ్యాప్తంగా చేస్తున్న కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఉల్లం పర్రు మాంటిసోరిస్ ప్రిన్సిపల్ వసంత లక్ష్మి పాల్గొని సమ్మర్‌లో స్పోకెన్ క్లాసులు పెట్టడం వల్ల విద్యార్థులు సెలవుల కాలాన్ని సద్వినియోగం చేసుకొని, జీవితంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని పొగిడారు. శిశుమందిర్ హెచ్‌ఎం ఎన్‌బివి.సూర్యలక్ష్మి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన లెక్చరర్స్‌ని, ఉపాధ్యాయులను తీసుకొచ్చి ఈ విద్యార్థులందరికీ తర్ఫీదు ఇప్పించిన వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్రామరాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి గ్రామర్ పుస్తకం, పెన్ను, బిస్కెట్స్ పంపిణీ చేశారు. శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో పదవ తరగతి పరీక్షలలో 600కి 592 మార్కులు సాధించిన గణేశుల నిఖిల్ మాణిక్ నాయుడు, 588 మార్కులు సాధించిన రొక్కం చరిష్మాకు, ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి చాంబర్స్ కాలేజీలో సెకండ్ ఇంటర్లో స్టేట్ ఫోర్త్ ర్యాంకు సాధించిన ఇరగవరపు లక్ష్మణ వర్షిత్‌ను అభినందిస్తూ నగదు ప్రోత్సాహకాలను అందించారు. వీరితోపాటు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు సూరిబాబు కూడా వెయ్యి రూపాయల చొప్పున విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసుదా ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధ రాజు మాట్లాడుతూ గ్రామర్ క్లాసులు పెట్టుకోవడానికి సహకరించిన యాజమాన్యం వారికి, గ్రామర్ క్లాసులు నిర్వహించిన ఉపాధ్యాయులు రాజు భూషణం, ప్రసాద్ సుధీర్, పద్మావతిలకు ధన్యవాదాలు తెలిపారు.

నా భర్తను అన్యాయంగా తొలగించారు

న్యాయం చేయండి : వికలాంగుని భార్య చదలవాడ సులోచన ఆవేదన

ఆచంట : మండలంలోని ఆచంట పెద్దపేట గ్రామానికి చెందిన చదలవాడ ముత్యాలరావు వికలాంగుడు. ఈయన గత రెండు సంవత్సరాలుగా ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నైట్ డ్యూటీ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. తన భర్త ముత్యాలరావు 90 శాతం వికలాంగుడని చూడకుండా, మండల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎటువంటి కారణం లేకుండా తన భర్త చేస్తున్న ఉద్యోగం నుంచి తొలగించారని శుక్రవారం ఆమె విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన కుటుంబం రోడ్డున పడిందన్నారు. తన భర్త ఎటువంటి తప్పు చేయలేదని, ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నాడన్నారు. తన భర్త ఆల్కహాల్ సేవించాడని భీమవరం డిఇఒకి ఆబద్ధపు రిపోర్ట్‌తో విధుల నుంచి తొలగించారని వాపోయారు. నా భర్త ఆల్కహాల్ సేవించినట్లయితే తగిన ఆధారాలతో నిరూపించాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె విలేకరుల వద్ద వాపోయారు. తన భర్తను యధావిధిగా జూన్ ఒకటో తేదీన విధుల్లోకి తీసుకోవాలని, అవసరమైతే జూన్ 15వ తేదీన ఎంఇఒ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె హెచ్చరించారు.

ఏరియా ఆస్పత్రిలో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - నరసాపురం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పట్టణంలోని రుస్తుంబాద ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఆపరేషన్ సిందుపై మాక్ డ్రిల్ నిర్వహించారు. డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రిల్‌లో యుద్ధం సంభవించినప్పుడు ఆస్పత్రిలోని రోగుల్ని ఏవిధంగా రక్షించాలి, ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స ఎలా చేయించాలి, మెడికల్ కిట్, అత్యవసర సేవలు, రక్తం, వైద్యులు, నర్సులకు శెలవు రద్దు, సెక్యూరిటీ, కంట్రోల్ రూమ్, 24 గంటలు నోడల్ అధికారులు ఏర్పాటు, రోగి రవాణ, జనరేటర్, నీటి సదుపాయాలు, 104, 108 వాహనాలు సిద్ధం, మత్తు మందులు తదితర విషయాలపై అవగాహన కల్పిస్తూ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆస్పత్రిలో మాక్‌డ్రిల్ జరుగుతున్న విషయం రోగులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఏమీ తెలియకపోవడంతో ఆస్పత్రిలో ఏమైన ప్రమాదం జరిగిందా అని ఆందోళన చెందారు. చివరికి ఆపరేషన్ సిందుపై మాక్ డ్రిల్‌పై అవగాహన కోసమేనని తెలియడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ మారుతి, డాక్టర్ భారతి పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - పెంటపాడు

మండలంలోని రాచర్ల, వల్లూరుపల్లి గ్రామాలలో ఉపాధి హామీ చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా శుక్రవారం మండలంలోని రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలలో పర్యటించిన సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు స్థిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచకపోవడం దారుణమన్నారు. ఉపాధి హామీ పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలిపారు. దేశంలో కార్పొరేటర్లు, సంపన్న వర్గాలపై ఉన్న ప్రేమ పేదలపై లేదన్నారు. కార్మికులకు హక్కులను కాలరాస్తున్నారని, ఉపాధి హామీ చట్టం ఎవరి భిక్షతోనో వచ్చింది కాదని, వామపక్షాల కృషితో 2005 ముందు యుపిఎ గవర్నమెంట్ మీద ఒత్తిడి చేసి సాధించుకున్న చట్టమని వివరించారు. ఈనెల 20న అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతీయ సమ్మె జరుగుతుందని, ఆ సమ్మెలో వ్యవసాయ కూలీలు కూడా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని ఉపాధి సమస్యలు పరిష్కారం కోసం, ఉపాధి నిధులు పెంచడం కోసం కూలీలంతా ఆరోజు పని మానేసి సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, అన్నవరం, ఎస్.శారదకుమారి, గారపాటి లక్ష్మణరావు, చుక్క వెంకటలక్ష్మి, సయ్యద్ సలీం, పెనుమాకుల సుబ్బారావు, బొట్టు మునేశ్వరరావు, పోతిన రామకృష్ణ, పంది అగ్గిరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు వేసవిలో చెల్లించే సమ్మర్ అలవెన్స్ తిరిగి పునరుద్ధరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మహాలక్ష్మి చెరువు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి కొద్దిసేపు వారితో ముచ్చటించి ఈనెల 20వ తేదీన జరుగుతున్న గ్రామీణ బంద్ ప్రాధాన్యతను వారికి వివరించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఈ వేసవిలో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే పరుమాళ్లు హెచ్చరించినందు వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వీరభద్రరావు కోరారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉపాధి కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రకటించినట్లు వీరభద్రరావు గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీలో తీసుకువచ్చిన జియో టాకింగ్‌తో ఒక పని దినంలో రెండుసార్లు ఫొటోలు తీయాలనే నియమం పెట్టడం సరికాదని, దీనివల్ల కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కాబట్టి రెండు ఫొటోల విధానం రద్దుచేసి పాత పద్ధతిలో ఉపాధి హామీ పనులకు అనుమతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో పాటు గ్రామీణ ఉపాధి బంద్ లో కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సానబోయిన లక్ష్మీదుర్గ, కండిపోయిన మహాలక్ష్మి, పాలా సుబ్రహ్మణ్యం, పితాని వెంకటేశ్వరరావు, వీరవల్లి సత్యనారాయణ, కండిపోయిన విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిఎం రిలీఫ్ ఫండ్ పేదవారికి అండగా నిలుస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు రూ.24,85,389 చెక్కులను ఎంఎల్ఎ చేతుల మీదుగా అందించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మమని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అన్ని సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ 10 నెలల్లో సిఎం రిలీఫ్ ఫండ్ కింద భీమవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 169 మందికి రూ.1,54,65,131 చెక్కులను అందించామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఎంఆర్‌సి భవన నిర్మాణ పనులు ప్రారంభం

వీరవాసరం : వీరవాసరం మండల విద్యాశాఖకు చెందిన అసంపూర్తిగా నిలిచిపోయిన ఎంఆర్‌సి భవన నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు ముందుకువచ్చారు. ఈమేరకు శుక్రవారం పనులు ప్రారంభించారు. మండలపరిషత్ నిధులు రూ.3 లక్షలతో ఈ పనులు పూర్తి చేయనున్నట్టు ఎంపిపి తెలిపారు. ఇదేవిధంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా హైస్కూల్ గ్రౌండులో ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ రక్షణగా ఎటువంటి వాహనాలు రాకుండా వీల్‌గేటు ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండు ఆక్రమణలపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్‌తో చర్చించారు. ఆక్రమణల వల్ల ప్రహరీ నిర్మించుకోలేకపోతున్నామన్నారు. పది పరీక్షలలో ఉత్తీర్ణత శాతం తక్కువ రావడంపై ఎంపిపి, జెడ్‌పిటిసిలు ఆరా తీసారు. అనంతరం ఆక్రమణల తొలగింపుపై తహశీల్దార్ ఎవి.రామంజనేయులను సంప్రదించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంఇఒ మల్లువలస శ్రీమన్నారాయణ, ఎంపిటిసి వీరవల్లి ఉష, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు హైస్కూల్ విద్యార్థులు

పాలకొల్లు : విద్యాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో వేసవి విజ్ఞానంలో భాగంగా పాలకొల్లు పరిసర ప్రాంతంలోని 6 నుంచి 10వ తరగతి చదువుతున్న వివిధ పాఠశాలల విద్యార్థులను పెద్దాపురం అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ వారి సైన్స్ సెంటర్‌కు విజ్ఞాన యాత్రగా తీసుకువెళ్లామని సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ తెలిపారు. విద్యార్థుల వద్ద నుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ఉచితంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వారి పాఠ్యపుస్తకాలలోని ప్రయోగాలను అక్కడ వివరించడమే కాకుండా విద్యార్థుల చేత స్వయంగా ఆ ప్రయోగాలు చేయిస్తారు. రిటైర్డ్ ఆర్‌బిఐ ఉద్యోగి రామశాస్త్రి విరాళాలతో సుమారు రూ.20 లక్షల ల్యాబ్‌ని ఏర్పాటు చేశారు. పాలకొల్లు నుంచి 2 బస్సులలో 15 మంది ఉపాధ్యాయులు, 60 మంది విద్యార్థులను తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు. ఆ సైన్స్ సెంటర్ రిసోర్స్‌పర్సన్ బుద్ధ శ్రీనివాస్ విద్యార్థులచే ప్రయోగాలు చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యా చైతన్య సమాఖ్య కార్యవర్గ సభ్యులు తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.